క్లుప్తంగా

వివరాలు నమోదుతో పథకాలకు అర్హత

దాచేపల్లి: వ్యవసాయ భూములు ఉన్న రైతులు తమ వివరాలు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి దొండేటి పాపకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో రైతు విశిష్ట సంఖ్యని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ఆధార్, పాసుపుస్తకం, 1బి, అడంగళ్, ఆధార్‌లింక్ అయిన ఫోన్ తీసుకుని వెళ్లి నమోదు చేయించుకోవాలని ఆమె సూచించారు. రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవటం వలన ప్రభుత్వం నుంచి అన్ని రకాల సబ్సిడీలు, పంటనష్ట పరిహారం, పథకాలకు అర్హత పొందుతారని ఆమె వెల్లడించారు.

ఉత్తమ డ్రైవర్లకు ఘనసత్కారం



మాచర్ల: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో బెస్ట్ యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లను ఘనంగా సత్కరించారు. ట్రాఫిక్ సీఐ లోకనాథం, డీపీటీఓ శివనాగేశ్వరరావు, నవ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా, డిపో స్థాయిలో ఎక్కువకాలం ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించిన డ్రైవర్లకు క్యాష్ అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు. మాచర్ల డిపోకు చెందిన బెస్ట్ డ్రైవర్లు పి.శ్రీనివాసరావు, పి.వి.నాయక్, ఎస్.బి.నాయక్‌లు ఉన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



దాచేపల్లి: మొక్కలు నాటి పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి అన్నారు. మండలంలోని తంగెడ మెయిన్ పాఠశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటుగా సమీపంలోని భవ్య సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు కూడా కార్యక్రమంలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు విస్తారంగా పెంచాలని, మొక్కలు పెంచటం ద్వారా మనిషి మనుగడ భూమిపై ప్రశాంతంగా ఉంటుందని రామిరెడ్డి అన్నారు. మొక్కలతో మనిషికి అవసరమైన ఆక్సీజన్ సమృద్ధిగా దొరుకుతుందని, వర్షాలు కూడా సకాలంలో కురుస్తాయని ఆయన తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలి

పిడుగురాళ్ల: విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఇంటర్మీడియట్ విద్యలో నూతన గ్రూపులను తీసుకొని రావాలని యునైటెడ్ హిస్టరీ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబురావు అన్నారు. పట్టణంలోని ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2025–26 విద్యా సంవత్సరంలో నూతన విద్యా విధానం అమలు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని దీనిలో భాగంగా ఎంబైపీసీని పునః ప్రారంభిస్తున్నారన్నారు. అయితే హెచ్‌ఈసీకి బదులుగా సీహెచ్‌ఈసీ గ్రూపును ఏర్పాటు చేస్తే సైన్స్ విద్యార్థులకు ఆర్ట్స్ సబ్జెక్టులను ఆప్షనల్‌గా, ఆర్ట్స్ విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టును ఆప్షనల్‌గా మార్చుకోవడం తప్పనిసరిగా చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని ఆయన కోరారు.

ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు సంఖ్య



పీసపాడు(క్రోసూరు): వ్యవసాయ శాఖ ద్వారా ఈ సంవత్సరం నుంచి రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలను పారదర్శకంగా, సులభతరంగా చేయడం కోసం వెబ్ ల్యాండ్ లో పొలం కలిగి ఉన్న ప్రతి ఒక్క రైతుకు 'ప్రత్యేక గుర్తింపు సంఖ్య' ను ఇస్తున్నట్లు ఏడీఏ వి.హనుమంతరావు తెలిపారు. మండలంలోని పీసపాడు రైతు సేవా కేంద్రంలో శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక సంఖ్య కలిగిన రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందేందుకు రైతు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీ, అడంగల్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, ఆధార్ నంబర్‌కు లింకు అయిన ఫోను నంబర్‌తో రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని కోరారు. ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందుటకు ప్రభుత్వం ఈనెల చివరి దాకా గడువుగా నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఏఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

అంధకారంలో వెలుగు రేఖలు

- నక్సల్స్ ప్రభావిత గ్రామాలు, తండాల్లో 'ఎల్‌డబ్ల్యూఈ' వెలుగులు
- త్రీఫేజ్ విద్యుత్ లైన్లు ఏర్పాటు
- కేంద్రం నిధులతో జరుగుతున్న పనులు



కారెంపూడిలో జరుగుతున్న నూతన లైన్ నిర్మాణ పనులు

కారెంపూడి: ఒకప్పటి నక్సల్స్ ప్రభావిత గ్రామాల్లో ఎల్‌డబ్ల్యూఈ (లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రిమిషన్) స్కీం వెలుగులు నింపుతోంది. ఎంతోకాలంగా త్రీఫేజ్ కరెంటుకు నోచుకోని మారుమూల గ్రామాలు, తండాలు, శివారు గ్రామాలు ఎట్టకేలకు 24 గంటలు త్రీఫేజ్ కరెంటుకు నోచుకుంటున్నాయి. దీంతో గ్రామాల్లో స్వయం ఉపాధికి ఏర్పాటు చేసుకున్న చిన్నతరహా పరిశ్రమలు, వెల్డింగ్ మిషన్లు, ఫ్లౌర్మిల్లు ఇతర స్వయం ఉపాధి షాపులన్నీ సవ్యంగా నడుస్తున్నాయి. కేంద్ర ప్రాయోజిత ఎల్‌డబ్ల్యూఈ పథకం ద్వారా మారుమూల గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోంది. పల్నాడులో ఒకప్పుడు నక్సల్స్ ప్రభావిత గ్రామాలలో ఇప్పుడు కరెంటు ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.

మండలానికి రూ.8కోట్లు కేటాయించిన కేంద్రం..

వెనుకబాటుకు గురైన ప్రజలకు 24 గంటలు త్రీఫేజ్ కరెంట్ సప్లయ్ అందివ్వడం ద్వారా వారి స్వయం ఉపాధికి ప్రోత్సాహం ఇవ్వాలనేది ఈ పథకం ఉద్దేశం. అందుకు గాను కేంద్రం 2017లో దేశంలో తీవ్ర వాద ప్రభావిత ప్రాంతాలకు రూ 2,568.09 కోట్లు కేటాయించగా అందులో కారెంపూడి మండలానికి కూడా అప్పట్లో రూ.8కోట్లు కేటాయింపులు జరిగాయి. ఆ నిధులతోనే గతంలో నక్సల్స్ ప్రభావిత గ్రామాలుగా ఉన్న మండలంలోని కారెంపూడి, కాచవరం, మిరియాల, నరమాలపాడు, వైకుంఠపురం, ఒప్పిచర్ల, పేట సన్నెగండ్ల, సింగరుట్ల తండా, వేపకంపల్లి, రెడ్డిపాలెం, బట్టువారిపల్లె గ్రామాలలో ఈ పనులు కొనసాగుతున్నాయి. ఈ గ్రామాల్లో నూతన లైన్ల నిర్మాణం జరుగుతోంది. కాలం చెల్లిన స్తంభాల లైన్ల స్థానంలో కొత్తవి వేస్తున్నారు. గతంలో ఏజీఎల్ సప్లయ్ ఉన్న సమయంలోనే గ్రామాల్లో త్రీఫేజ్ ఉండేది. ఈ అభివృద్ధి పనుల వల్ల 24 గంటలు త్రీఫేజ్ సప్లయ్ ఉంటుంది.

ఎనిమిది గ్రామాల్లో అభివృద్ధి పనులు

కాలం చెల్లిన విద్యుత్తు స్తంభాలన్నీ మార్చడం, అలాగే కాలం చెల్లిన తీగలను మార్చడంతో పాటు నూతన లైన్లు వేస్తున్నారు. ఎల్‌టీ, 11 కేవీ లైన్ల నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. అలాగే కాలం చెల్లిన ట్రాన్స్‌ఫార్మర్లు అన్నింటిని మార్చడం జరుగుతోంది. దీనివల్ల ఆయా గ్రామాలలో విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతాయి. ఈ పనుల వల్ల 24 గంటలు త్రీ ఫేజ్ ఇవ్వడానికి వీలుపడుతుంది. కారెంపూడి మండలంలో 8 గ్రామాలతో పాటు వాటి శివారు తండాలు, కాలనీలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

– సింగయ్య, విద్యుత్ ఈఈ, మాచర్ల

మారుమూల తండాల్లో సైతం..

మండలంలో రూ.8 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. గత ఏడాది పనులు ప్రారంభించాం. ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. నిధులు ఎప్పుడో శాంక్షన్ అయ్యాయి. కానీ గత ఏడాది నుంచే పనులు ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేయిస్తోంది. పాత లైన్లన్నీ తొలగిస్తున్నాం, అసలు లైన్లు లేని చోట కరెంటు లేని మారుమూల పల్లెల్లో, తండాలలో కూడా లైన్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు జరుగుతోంది.

– పి.అనిల్‌రెడ్డి, బీఎస్ఆర్, ప్రాజెక్టు మేనేజర్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పిడుగురాళ్లలో రోడ్లను శుభ్రం చేస్తున్న కమిషనర్ పర్వతనేని శ్రీధర్, మున్సిపల్ వర్కర్లు



శ్రీచక్ర సిమెంట్స్‌లో స్వచ్ఛాంధ్ర దివస్‌లో పాల్గొన్న జీఎం రాజేంద్ర ప్రసాద్, అధికారులు



నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పిడుగురాళ్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 22వ వార్డులో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. దానిలో భాగంగానే పట్టణంలోని 33వ వార్డుల్లో కార్యక్రమం నిర్వహించామని ఆయన తెలిపారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కారెంపూడిలో...

కారెంపూడి: స్వచ్ఛాంధ్ర దివస్ సందర్భంగా శనివారం మండల పరిషత్తు కార్యాలయ ఆవరణ, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలను అధికారులు, ఉద్యోగులు శుభ్రం చేశారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, మండల స్థాయి అధికారులు ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొని కార్యాలయాల ఆవరణలను శుభ్రం చేశారు. అలాగే శ్రీ చక్ర సిమెంట్స్‌లో స్వచ్ఛాంధ్ర దివస్‌ను పాటించి కర్మాగారం ఆవరణను శుభ్రం చేశారు. ఫ్యాక్టరీ జీఎం రాజేంద్ర ప్రసాద్‌తో పాటు ఇతర అధికారులు ఉద్యోగులు కార్మికులు కార్యక్రమంలో పాల్గొని ఫ్యాక్టరీ పరిసరాలను శుభ్రం చేశారు.

సత్రశాలలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ర్యాలీ..

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న ఏపీ జెన్‌కో నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ర్యాలీని అధికారులు, కాంట్రాక్ట్ ఉద్యోగులతో కలసి నిర్వహించినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకట రమణ తెలిపారు. ప్రతి నెల మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రాజెక్టులో నిర్వహించడం జరిగిందన్నారు. పర్యావరణాన్ని కాపాడడమే లక్ష్యంగా పని చేస్తూ పారిశుధ్యానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈఈ సుబ్రమణ్యం, ఏడీఈలు గిరిబాబు, ప్రసాద్, బోడయ్య, ఏఈలు జయపాల్, మల్లేష్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ గురజాలకు సహకరించండి...

గురజాల : ప్రతి ఒక్కరూ స్వచ్ఛ గురజాలకు సహకరించాలని నగరపంచాయతీ కమిషనర్ వైవీఎల్ఎన్ శివన్నారాయణ రావు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని మూడవ శనివారం సందర్భంగా స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నెలలో ఒక రోజు పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా ఎంపీడీఓ గౌసియాభేగం ఆధ్వర్యంలో కార్యాలయం ప్రాంగణాన్ని శుభ్రం చేశారు.

జలవనరుల శాఖ ఆధ్వర్యంలో...

విజయపురిసౌత్:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నాగార్జున సాగర్ జల వనరుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ కార్యాలయం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులతో పాటు నాయకులు చీపురులను చేతబట్టి పరిసరాలను శుభ్రం చేశారు. జలవనరుల శాఖ డీఈ మురళీధర్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

మాచర్ల: స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ మాచర్ల ఆధ్వర్యంలో మాచర్ల రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీఓ శేషిరెడ్డి స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. అనంతరం ఉద్యోగులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

ఘనంగా సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి



సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్‌కు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతిని మండలంలోని రామచంద్రాపురం తండాలో శనివారం మాజీ సర్పంచ్ బాణావత్ శ్రీను నాయక్, సర్దార్ నాయక్, మంత్రు నాయక్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని దేశవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తుండటంతో అందులో భాగంగా ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి రామావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ బంజారాలకు సేవాల్ మహరాజ్ గుర్తింపు తెచ్చారన్నారు. భక్తులు తెల్లవారుఝాము నుంచే స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు నృత్య ప్రదర్శన చేశారు. సాయంత్రం స్వామివారి చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి ఏర్పాటు చేసిన మహిళా కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. రాత్రి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. మూడావత్ ధర్మానాయక్, మోతీలాల్ నాయక్, రాములు నాయక్, గార్యా నాయక్, ఇస్లావత్ జగన్ నాయక్, ఎం పార్వతీ స్వామి, రమావత్ హనుమంతు నాయక్, విద్యా కమిటీ చైర్మన్ రూప్లా నాయక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విజయపురిసౌత్‌లో..

విజయపురిసౌత్: సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని విజయపురిసౌత్‌లోని సేవాలాల్ ఆలయం వద్ద ఆలయ ధర్మకర్త కరంటోత్ పాండు నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీను నాయక్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం వద్ద ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన నత్యాలు ఆకట్టుకున్నాయి. వీరాస్వామి యాదవ్, బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, గుండాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ కార్యక్రమాలు

గురజాల రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా చేపడుతున్న అంగన్‌వాడీ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. పోషణ్ భీ– పడాయి భీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలకు చిన్నారులకు ఎలా విద్యాబుద్ధులు నేర్పించాలి. వారిలో సృజనాత్మకతను ఎలా వెలికి తీయాలి అన్న విషయాలపై ఇన్‌చార్జి సీడీపీఓ వై.రత్నకుమారి శిక్షణ ఇచ్చారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్లరూరల్: చిన్నారుల మానసిక వికాసం, ఆరోగ్యంపై అంగన్‌వాడీ టీచర్లు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజలి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి జెడ్పీ హైస్కూల్‌లో బ్రాహ్మణపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ భీ – పఢాయి భీ శిక్షణా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రేపు మిట్టగుడిపాడు తిరునాళ్ల



భ్రమరాంబ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానం

మిట్టగుడిపాడు(రెంటచింతల): మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో వేంచేసిన అతి పురాతనమైన శ్రీ భ్రమరాంబ సమేత నాగేశ్వర స్వామి దేవస్థాన తిరుణాళ్ల వేడుకలు ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ప్రధాన అర్చకుడు వెల్లటూరి నాగేశ్వరశర్మ, సర్పంచ్ గొట్టం ప్రమీల గురవారెడ్డి శనివారం తెలిపారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, 7 గం. గణపతిపూజ, 8 గం. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 11 గం. శివపార్వతుల వార్షిక శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాత్రి విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవ వేడుకలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీవెనలు పొందాలని కోరారు.

లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం



దాచేపల్లి: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి పీడీఎఫ్ తరఫున ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న కేఎస్ లక్ష్మణరావుని అఖండ మెజార్టీతో గెలిపించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు అన్నారు. ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న లక్ష్మణరావుకి మద్దతుగా రైతు సంఘం నాయకులు, సీపీఎం నాయకులు శనివారం దాచేపల్లిలో విస్తృతంగా పర్యటించారు. మేధావుల సభలో ఉండాల్సింది రాజకీయ నిరుద్యోగులు కాదని, ప్రజల సమస్యలను అంకితభావంతో పనిచేసే లక్ష్మణరావులాంటి మేధావులు ఉండాలని గోపాలరావు చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన లక్ష్మణరావుని మరోసారి గెలిపించాలని, పాలకులు చెప్పే మోసపూరితమైన మాటలకు మోసపోవద్దని ఆయన తెలిపారు. నాయకులు ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీఆర్కే జన్మదిన వేడుకలు



పీఆర్కేచే కేక్ కట్ చేయిస్తున్న నవులూరి భాస్కర్ రెడ్డి, గొట్టం బ్రహ్మారెడ్డి, శ్యామల రవికిశోర్‌రెడ్డి

రెంటచింతల: వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచర్ల మాజీ శాసన సభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) జన్మదినం సందర్భంగా శనివారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్యామల రవికిశోర్‌రెడ్డి హైదరాబాద్‌లో పీఆర్కేచే కేక్ కట్ చేయించారు. ఈసందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ పల్నాడు ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. పార్టీ నేతలు మాట్లాడుతూ పల్నాడు ముద్దుబిడ్డ పీఆర్కేకు భగవంతుడు ఆయురారోగ్యాలతో పాటు మంచి జీవితాన్ని ప్రసాదించి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టేలా దీవించాలని కోరారు. నవులూరి మాధవ రెడ్డి, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నవులూరి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే సురక్షిత ప్రయాణం



నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

దాచేపల్లి: నిబంధనలు పాటిస్తూ చేసే ప్రయాణం ప్రాణాలను కాపాడుతుందని, భద్రతతో కూడిన ప్రయాణం అభివృద్ధికి తొలిమెట్టు అని స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ మైలా రంగారెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా స్థానిక పోలీసులతో కలిసి పాఠశాల విద్యార్థులు శనివారం దాచేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన రోడ్డు భద్రతపై ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రంగారెడ్డి మాట్లాడుతూ.. వాహనాలపై వెళ్లే సమయంలో రెప్పపాటులో రోడ్డు ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు పోతున్నాయని, సరియైన భద్రత నియమాలు పాటించకపోవటం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్రవాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ ఉండాలని, మద్యం సేవించకూడదని ఆయన తెలిపారు. కానిస్టేబుల్ రమేష్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాల నుంచి తప్పించుకోవాలన్నారు. కానిస్టేబుళ్లు ఖాజావలి, సాంబశివరావు, పీఈటీ ప్రతాప్ రెడ్డి, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం చేసి.. స్థానికులకు దొరికేసి..!

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు
- పలు కేసుల్లో చోరశిఖామణిగా గుర్తింపు



కోటేశ్వరరావును పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

దాచేపల్లి: ఇళ్లలోకి చోరీచేసి వెళ్తున్న దొంగని స్థానికులు పట్టుకున్నారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురంలో రెండు ఇళ్లల్లో దొంగతనం చేసి పారిపోతున్న మిర్యాలగూడెంకి చెందిన వేముల కోటేశ్వరరావు అలియాస్ కోటేశ్ అనే దొంగని శనివారం స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గ్రామస్తు కథనం ప్రకారం.. నారాయణపురంలో నివాసం ఉంటున్న గాజుల గాంధీ అనే వ్యక్తి ఇంటిలోకి దొంగ కోటేశ్వరరావు చొరబడి నగదు చోరీ చేశాడు. అక్కడి నుంచి కొత్త రామారావు అనే వ్యక్తి ఇంటిలోకి ప్రవేశించి నగదు, నగలు చోరీ చేసి బయటకు వస్తున్న క్రమంలో స్థానికులు దొంగని గుర్తించారు. స్థానికులు అక్కడకు చేరుకోవటంతో దొంగ కోటేశ్వరరావు పారిపోయేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశాడు. స్థానికులు చాకచక్యంగా దొంగని వెంబడించి పట్టుకున్నారు. పారిపోతుండగా పట్టుకున్న దొంగకి దేహశుద్ధి చేసి కాళ్లు, చేతులను తాళ్లతో బంధించారు. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని దొంగ కోటేశ్‌ని అదుపులోకి తీసుకున్నారు. దొంగ కోటేశ్‌తో పాటుగా మరో ఇద్దరు కూడా ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. దొంగ కోటేశ్‌పై పలు ప్రాంతాల్లో చోరీ కేసులు ఉన్నట్లుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మిర్యాలగూడెంకి చెందిన కోటేశ్‌పై మిర్యాలగూడెం, నల్గొండ, హుజూర్‌నగర్, గుంటూరు, తిరుపతితో పాటుగా పలు ప్రాంతాల్లో జరిగిన చోరీల్లో నిందితుడిగా గుర్తించారు. కోటేశ్‌ని విచారణ చేస్తే మరింత సమాచారం వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు.

ప్రశాంత వాతావరణంలో దైవదర్శనానికి ఏర్పాట్లు



సత్రశాల దేవస్థానంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఈ శ్రీనివాసులు

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న అతి పురాతనమైన శైవక్షేత్రం శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా తరలివచ్చే భక్తులు ప్రశాంత వాతావరణంలో దైవదర్శనం చేసుకుని సంతోషంగా తిరిగి వెళ్లేలా చర్యలు చేపట్టాలని డీఈఈ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన డీఈఓ అచ్యుత్, ఏఈలతో కలిసి దేవస్థానంలో జరుగుతున్న మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. అనేక ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి తరలివచ్చే వేలాదిమంది భక్తులకు మౌలిక వసతులు కల్పించేందుకు వివిధ శాఖాధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. భక్తులు నదీస్నానం చేసే సమయంలో నది వద్ద విద్యుత్ దీపాలతో పాటు ఖచ్చితంగా గజ ఈతగాళ్లు నదివద్ద ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు మంచి నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. దేవస్థానం పరిసరాలలో జాగారం చేసే భక్తులకు ఎలాంటి వసతులు కల్పిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అర్చకుడు చిట్టేల మల్లిఖార్జునశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట ఈఓ గాదె రామిరెడ్డి తదితరులున్నారు.

ఆటోవాలాలు నిబంధనలు పాటించాలి

సత్తెనపల్లి రూరల్ సీఐ సుబ్బారావు



కౌన్సెలింగ్ ఇస్తున్న సత్తెనపల్లి రూరల్ సీఐ

నకరికల్లు: ఆటోల్లో అధికంగా ఎక్కి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.వి.సుబ్బారావు సూచించారు. స్థానిక అద్దంకి– నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై శనివారం తనిఖీలు నిర్వహించారు. కూలీలతో కిక్కిరిసిపోతున్న ఆటోలను నిలిపివేశారు. ఆటో డ్రైవర్, కూలీలతో మాట్లాడారు. గతంలో అధికలోడుతో వెళ్తున్న ఆటోలు ప్రమాదాలకు గురై కూలీలు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు గుర్తు చేశారు. ఉపాధి కోసం వెళ్తున్నా ప్రాణాలు నిలబెట్టుకోవడం ముఖ్యమని చెప్పారు. ఓవర్‌లోడుతో వెళ్తే వాహనాలు కంట్రోల్ కాక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. నిబంధనలు పాటించని ఆటో యజమానులు, డ్రైవర్‌లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తామని ఎక్కువమంది కూలీలను ఎక్కించుకుంటే ఆటో యజమానులు, డ్రైవర్‌లపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చల్లా సురేష్, ఏఎస్ఐ బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

19,20 తేదీలలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

అచ్చంపేట: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల 19, 20 తేదీలలో వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధి సూరే సుబ్బారావు శనివారం తెలిపారు. అఖండనామ ఏకాహ సంకీర్తన పారాయణ, క్షీర కలశాభిషేక మహోత్సవం, జెండా ప్రతిష్టాపన, అర్చక కుంకుమపూజ, లలితాసహస్రనామ స్తోత్రపారాయణ నిర్వహించనున్నట్లు తెలిపారు.